# ఒంటరి నక్షత్రం

మంచిగంధపు పరిమళం, అగరువత్తుల ఘుమాయింపు, మల్లెల సౌరభం, పచ్చి తాటాకుల వింత వాసన, మామిడి తోరణాలు, మంగళ వాయిద్యాలు, వెన్నెల కన్నె తీర్చిదిద్దిన వెండి ముగ్గులు, వెలుతురు పువ్వుల లేలేత నవ్వులు, పట్టు చీరల రెపరెపలు, కన్నె పిల్లల హృదయాల్లో మ్రోగుతున్న సన్నాయి నాదాలు, నుదుట కళ్యాణ తిలకం, చెక్కిట చుక్క, కళ్ళల్లో కలల హరివిల్లులు - విచిత్రమైన స్పందనను కలిగిస్తోంది వాతావరణం.

హృదయంలో విరబూస్తున్న మధుర భావాలు శారద చెక్కిళ్ళలో ప్రతిఫలిస్తున్నాయి. పురోహితుడు చెప్తున్నట్లు పూజ చేస్తూ మధ్య మధ్యలో సిగ్గుగా స్నేహితురాళ్ళ వంక చూస్తోంది.

అప్పటివరకు బొంగరంలా ఇంట్లోకి, బయటికి తిరుగుతూ అన్నీ అందించిన అరుంధతి పందిరి గుంజకు ఆనుకుని కూతురివంక ప్రేమగా, తన్మయంగా చూస్తోంది. నిన్నమొన్నటి ఫ్రాకుల పాపాయి ఇంతై, ఇంతింతై, చీరసింగారించి యిప్పుడు నవవధువై గౌరీ పూజ చేస్తోంది. చిలిపి నవ్వుల, కొంటె అల్లరుల అమ్మాయి సిగ్గుల మొగ్గయి క్రీగంట చూస్తోంది.

కల్యాణ ఘడియవస్తే ఆగదంటారందుకే. యింత త్వరగా, యింత తేలికగా కూతురి పెళ్లి నిశ్చయమవుతుందని అనుకోని అరుంధతి ఆనందాన్ని యిముడ్చుకోలేకపోతూంది. శారద బంగారు బొమ్మె అయినా,

రిసెర్చి స్కాలరయినా కట్నం ప్రసక్తి లేకుండా, ఆమెకు మనసిచ్చిన వాడు, ఆమెకు నచ్చిన వాడయిన వ్యక్తితో పెళ్ళి జరగడం - అదీ వధువు గుణగణాలతో, విద్యాసంపదతో నిమిత్తం లేకుండా కట్నాలివ్వక తప్పని సరయిన పరిస్థితుల్లో యింతసులువుగా జరిగిపోవడం ఆమెకు ఓ అద్భుతంలా కనిపిస్తూంది. డబ్బుతో ముడిపడ్డ యీ లోకంలో యింక ఒంటరిగా పోరాడే ఓపిక మిగల్లేదు తనకు. ఒంటరిగా, అవును తను ఒంటరిదే ... కొండంత విషాదం కారు మేఘంలా చుట్టేసింది.

* * *

ఆనాటి కలలు కళ్ళ ముందు కదలాడు తున్నాయి. రెండెకరాల రైతు కలలో కూడా అనుకోలేని కోరికల్ని కోరుకుంది అరుంధతి. తన ముగ్గురు బిడ్డలకి పెద్ద పెద్ద చదువులు చెప్పించాలని కలలు కంది.... కాదు., పంతం పట్టింది. అది నెగ్గించుకోవడానికి గాను కడుపునిండా తిండీ, కంటినిండా నిద్రలేకుండా శ్రమించింది. అరడజను గేదెల్ని, ఇరవై కోళ్ళను పెట్టుకుని పైసా పైసా కూడాబెట్టి చలపతి, రఘుల చదువుకు ఖర్చు పెట్టింది. వాళ్ళు శ్రద్ధగా చదువుతూ ఒక్కొక్క మెట్టేపైకి ఎక్కుతున్న కొద్ది తమ శ్రమ ఫలిస్తూందని మురిసి పోయేవారు అరుంధతి, ఆమె భర్త చక్రపాణి, ముగ్గురిలోకి చిన్నది శారదకూడా పైచదువుకు వచ్చే సరికి అందరికీ డబ్బు పంపడానికి ఇబ్బంది అయేది. అలాంటి సమయాల్లో దేవతలా ఆదుకునేది పక్కింటి వారమ్మాయి కమల. ఇంట్లో చెప్పి, చెప్పకుండా వంద, ఏభై పంపుతూ వుండేది చలపతికి. అవసరం అంతరాత్మను జోకొడుతున్నా, అస్వతంత్రురాలయిన ఆడపిల్ల అందిస్తున్న సహాయాన్ని అంగీకరించడానికి మన సొప్పేది కాదు.

"ఏమిటత్తయ్యా నీ మొహమాటం?! మా యింట్లో నాకా మాత్రం స్వతంత్రం వుంది. ఈ డబ్బు గురించి నేనెవరికీ సంజాయిషీ చెప్పాల్సిన అవసరం లేదు, నేను కష్టపడి పెంచిన మల్లె పాదల పూలమ్మగా వచ్చిన

డబ్బిది. మల్లెపూలంత పవిత్రమయిందీ డబ్బు "బొడ్డుమల్లె పూవులా స్వచ్ఛంగా నవ్వుతూ అరుంధతిని ఒప్పించడానికి ప్రయత్నించేది కమల, కమల అంతగా చెప్తున్నా సరిపెట్టుకోలేకపోయేది అరుంధతి.

"కేవలం అందం కోసమో, సరదా కోసమో పూల మొక్కల్ని పెంచ గలిగే అదృష్టమెలానూ లేదు మనకు. అమ్మ గలిగిన వస్తువే ఒక్కటి దొరికినా అమ్ముకుంటే గాని గడవని బ్రతుకులు మనవి. అందుకే పది మందికీ పది దోసిళ్ళు పంచాల్సిన పువ్వుల్ని పది పావలాలకు అమ్ము తున్నాను. ఇది బావ చదువుకు ఉపయోగ పడడం కంటే కావలసిందే ముందత్తయ్యా?" రక్తం పంచుకు పుట్టిన అన్నదమ్ములు, తోబుట్టువులు 'దేహీ' అని చెయ్యి చాచి అడిగినా మొహం చాటేసిన సమయంలో ఆ అమ్మాయి చూపుతున్న ఔదార్యానికి కన్నీళ్ళు తిరిగాయి అరుంధతికి. హృదయం మూగవోయి, మాటలు రాక కమల భుజంచుట్టూ చెయ్యేసి పొదవుకుని మౌనంగా కోటి ఆశీర్వాదాల్ని కురిపించింది.

కమల చలవ వల్ల చలపతి ఏ ఆటంకం లేకుండా ఎమ్.ఇ పూర్తి చేశాడు. అప్పటికి కమల, చలపతి బాగా సన్నిహితమయ్యారు. అరుంధతికి కూడా కమలను కోడల్ని చేసుకుంటే బావుంటుందనిపించేది, తనంటేనూ, తన కొడుకంటేనూ ప్రాణంపెట్టే యీ పిల్ల తన యింటి దీపమవుతుంది. ఆమె చేతుల్లో తన చివరి రోజులు చల్లగా గడిచిపోతాయని తలపోసేది అరుంధతి.

అరుంధతి కమ్మటి ఆలోచనల్లో వుండగా ఉద్యోగ ప్రయత్నం కోసం వెళ్ళిన చలపతి ఓ క్రొత్త వార్తను మోసుకొచ్చాడు. చలపతి ప్రొఫెసరొకాయన అమెరికాలో వుండేలా ఏర్పాటు చేసుకుని వెళ్ళి పోతూ కూతురికి పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టాడు. ఇటు చదువులోనూ, అటు ఆటల్లోనూ చురుగ్గా వుండే చలపతి ఆయన దృష్టి నాకర్షించాడు. ఒక లెక్చరర్ ద్వారా చలపతి దగ్గర పెళ్ళి ప్రస్తావన తెచ్చి అతన్ని ఒప్పించడానికి ప్రయత్నించారు.

"నువ్వేమంటావమ్మా? మంచి అవకాశమిది. యిక్కడే ఒక ఉద్యోగం దొరకొచ్చనుకో. ఐనా ఎక్కడవేసిన గొంగళి అక్కడేనన్నట్లు వుంటుంది బ్రతుకు. నేను అమెరికా వెళ్ళానంటే మన బ్రతుకుల స్వరూపమే మారిపోతుందమ్మా!" కొడుకు చెప్పేది విని నీరుకారిపోయింది అరుంధతి. ప్రొఫెసర్ కూతుర్ని చేసుకుని అమెరికా వెళ్ళేవాడు కమలనేం చేద్దామని?! కమల అనురాగాన్నీ, ఆమె చేసిన సాయాన్ని ఎంత త్వరగా మరిచి పోయాడు వీడు! కమలను పెళ్ళి చేసుకుని స్వశక్తితో స్వంత ప్రతిభ వల్ల అతను అమెరికా వెళ్ళుంటే తనంత అదృష్టవంతురాలు ప్రపంచంలో లేదని మురిసిపోయేది. కాని...

"ఇక్కడ సంవత్సరమంతా గొడ్డుచాకిరి చేసి సంపాదించే డబ్బుని అక్కడ ఒక్క నెలరోజుల్లో సంపాదించవచ్చు. రఘు, శారదల చదువుకోసం యింక నువ్వు, నాన్న యిలా అస్తమానం కష్ట పడాల్సిన అవసరముండదు. మనం పేదవాళ్ళమని చులకన చేసిన వాళ్ళముందు సగర్వంగా తలెత్తుకోవచ్చు. రఘుని, శారదని కూడా అమెరికా తీసుకువెళ్ళడానికి అవకాశముంటుంది." నిర్జీవంగా కొడుకు మాటలు వింటోంది అరుంధతి - వాడు చెప్పేవన్నీ నిజమేకావచ్చు. కాని మనిషికీ కావలసింది డబ్బొక్కటేనా? డబ్బులేకపోతే బ్రతుకులో ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు. నిజమే, కాని చదువుకు ఏకైక లక్ష్యం సంపాదనేనా? బ్రతుకులోని మిగతా విలువలకు అర్థమేలేదా?

"ఏమిటమ్మా మాట్లాడవు? కమల గురించి ఆలోచిస్తున్నావా?" తను బయట పెట్టడానికి తటపటాయిస్తున్న విషయాన్ని అతనే ఎత్తడంతో ఆత్రుతగా చూసింది అరుంధతి. కమలని వీడు మరిచిపోలేదు. కమలని గురించి ఆలోచించాకైనా తనలోని లోపాన్ని గుర్తిస్తాడు - ఆశగా అతని వంక చూసింది అరుంధతి.

"అమ్మా! వాగ్దానాలు, సెంటిమెంట్ల కాలం చెల్లిపోయింది. నిచ్చెన

కనిపిస్తూంటే ఎక్కి పైకి చేరుకోవడం సమర్థుల లక్షణం. సెంటిమెంట్స్‌ని పట్టుకుని క్రిందే కూర్చుంటానని భీష్మించడం వెర్రితనం. కమల నా చదువుకు సహాయపడింది నిజమే. ఆవిడ యిచ్చిందానికి రెండింతలు అమెరికా నుంచి పంపిస్తాను. సరేనా?'' విరక్తిగా, ప్రాణంలేనట్లు చూస్తూంది అరుంధతి. ఆడపిల్ల ప్రేమను కూడా డబ్బుతో తూచే దౌర్భాగ్యుడా! నీకు సెంటిమెంట్లు, వాగ్దానాలు అర్థంలేనివిగా కనిపించడంలో ఆశ్చర్యంలేదు. కమల పంపిన డబ్బుకు రెండింతలిస్తావు. ఆ అమ్మాయి నీకిచ్చిన ధైర్యా నికి, ప్రేమకు బదులేమిస్తావు?

అతని మాటలధోరణిని బట్టి అతనే స్థిర నిశ్చయానికి వచ్చినట్లు, మరో ఆలోచనకు తావులేనట్టు కనిపించడంతో తను ఎంతవరకు కల్పించుకుని నచ్చ చెప్పడానికి ప్రయత్నించవచ్చో అర్థం కాలేదు? అరుంధతి గుంజాటనపడుతూనే కొడుకుకు యిష్టమైన వంటలు చేస్తూంది. అంతలో చలపతికి యిష్టమని కోవాతో గులాబ్‌జామ్ చేసి తెచ్చింది కమల. కమలవంక చూడడానికి మొహం చెల్లక వంటింట్లోనే వుండిపోయింది అరుంధతి. కొంచెం సేపుపోయాక కమల వంటింట్లోకి వచ్చింది.

"అత్తయ్యా! కూర తరగమంటావా?'' పీట వాల్చుకుని కూర్చుంది కమల.

"నీకెందుకమ్మా శ్రమ? నేను చేసుకుంటాగా!'' కమల ముఖం వంక సూటిగా చూడడానికి జంకుగావుండి పొయ్యివంక దీక్షగా చూస్తూంది. కాసేపు మౌనంగా అరుంధతిని చూస్తూ కూర్చుంది కమల.

"అత్తయ్యా ఎందుకంత బాధపడతావు?! బావ నాతో విషయమంతా చెప్పాడు'' ఒక్కసారి గుండె కొట్టుకోవడం ఆగినట్లుగా అనిపించింది అరుంధతికి.

"వాడేదో పిచ్చిగా వాగుంటాడు. నేను నాలుగు చీవాట్లేసి ఒప్పిస్తాను. నువ్వేదేమీ మనసులో పెట్టుకోకమ్మా!'' చప్పున అంది అరుంధతి.

"చీవాట్లేసి, ఒప్పించి పెళ్ళి చేయడమంత మంచిదంటావా అత్తయ్యా?! నా కోసం బావ ఈ అవకాశాన్ని ఒదులుకుని వుంటే ఆనందంతో నా గుండె పగిలిపోయేదేమో!" కమల కళ్ళు నిండు కున్నాయి - ఒక నిమిషంలో తమాయించుకుంది.

"నా వల్ల అమెరికాలోని సుఖజీవితాన్ని పోగొట్టుకున్నానన్న భావం బావకు నామీద అసంతృప్తినే కలిగిస్తుంది తప్ప, ప్రేమను కల్పించదు. జీవితాంతం ఆ అసంతృప్తే బావను తొలుస్తూ వుంటుంది. అంతకన్నా నరకం మరొకటుండదు నాకు" తనకుతానే చెప్పుకుంటు న్నట్లుగా చిన్నగా చెప్తూంది కమల. ఆ అమ్మాయిని చూస్తూ గుండెలు పిండేసినట్లుగా బాధపడుతూంది అరుంధతి.

"ప్రమాణ పూర్తిగా చెప్తున్నానత్తయ్యా బావకు డబ్బిచ్చినప్పుడు తనని చేసుకోవాలనే ఆశతో యివ్వలేదు. డబ్బు యిబ్బంది వల్ల బావ చదువు కుంటుపడడం యిష్టం లేక యిచ్చాను తప్పితే, నాకా ఆలోచన ఏ కోశానా లేదు. కాని.. బావ అమెరికా వెళ్ళినాకు డబ్బు పంపుతా నంటూంటే.., నాకు మనషుల మీద, బ్రతుకు మీద నమ్మకం చచ్చి పోతూందత్తయ్యా?" దీనంగా, సర్వంకోల్పోయినట్లుగా చూస్తూన్న కమల మాటలు విని దుఃఖాన్నాపుకోలేకపోయింది అరుంధతి.

రెక్కలు వచ్చి తన ప్రక్కన నిలుస్తాడనుకొన్న కొడుకు రెక్కలు విప్పుకుని అమెరికాకు ఎగిరిపోతూంటే నిస్సహాయంగా చూస్తూ వుండడం తప్ప ఏమీ చెయ్యలేకపోయింది అరుంధతి. అక్కడ కూడా చలపతి అంచెలంచెలుగా పైకి పోతున్న వార్తలు తెలుస్తున్నాయి. కమలకు జరిగిన అన్యాయం భూతద్దంలోనుంచి కనపడి బాధగా వున్నా, కొడుకు ఉన్నతి గురించి తెలిసి సంతోషంతో, గర్వంతో ఉప్పొంగిపోతూంది.

రఘు చదువయిపోయాక అన్నగారి చేయూత వల్ల అతను కూడా అమెరికా వెళ్ళిపోతూంటే తట్టుకోలేకపోయింది అరుంధతి. శారదను

తలచుకుని తనను తాను ఓదార్చుకుంటున్నా భయంకరంగా ఎదుట నిలుస్తున్న శూన్యాన్ని భరించలేకపోతూంది... కొడుకులిద్దరూ తమకు నచ్చిన జీవితాన్ని వెదుక్కుని వెళ్ళిపోయారు. రెక్కలొచ్చిన పక్షులు తమ గూళ్ళను తాము నిర్మించుకోవడానికి ఎగిరిపోవడం సహజం. ఎక్కడో అక్కడ వాళ్ళు సుఖంగా వుండడమే తను కోరుకొనేది... కొడుకు లిద్దరూ కలిసి తనకు డబ్బు ఇబ్బంది లేకుండా చేశారు.

... కాని.... యిది తనను సంతోష పెట్టడం లేదు. తనకు కావలసింది కష్టంలో, సుఖంలో నీ ప్రక్కన మేమున్నామమ్మా అన్న ఊరడింపు. అప్పుడప్పుడైనా 'అమ్మా!' అన్న తియ్యటి పిలుపు వినిపించడం, తను ఒంటరిది కాదన్న ధైర్యాన్ని కల్పించే బిడ్డల స్పర్శ. దురదృష్టవశాత్తూ తనుకోరుకునేదే తనకు దూరమౌతూంది. మౌనమునిలా జీవితాంతం తనకు సహకరించిన భర్త కన్ను మూసిననాడు కొడుకులు తన ప్రక్క నుంటే బావుండునని ఎంతగానో ఆరాటపడింది. చివరి క్షణాల్లో భర్త ప్రాణం కొడుకుల కోసం కొట్టుకుపోతూంటే దుఃఖాన్ని దిగమింగి ఆయనకు ధైర్యం చెప్పింది.

కాని ఈ రోజు హృదయం తన మాట వినడం లేదు. కదిపితే కన్నీళ్ళు దూకుతానంటున్నాయి. నాలుగురోజులుగా యీసారన్నా కొడుకులు వస్తారనే ఆశతో ఎదురుతెన్నులు చూస్తూంది. ఏ చిన్న అలికిడైనా వాళ్ళే వచ్చారన్నా ఆశతో వాకిట్లోకి పరుగెత్తుకు వస్తూంది. ఒక్కగా నొక్క కూతురి పెళ్ళి ఆమె కోరుకున్న వాడితో ఏ సమస్యా లేకుండా అవుతూ వున్నందుకు ఎంత సంతోషపడుతూందో, కొడుకులు రాకపోవడంతో అంతగానూ క్రుంగిపోతూవుంది.

"అమ్మా!" ఉలిక్కిపడి ఆలోచనలలో నుంచి బయటపడింది అరుంధతి. జాలిగా చూస్తున్న శారదను చూసి సంబాళించుకుంది. తల్లి ఎందుకు దుఃఖపడుతూందో తెలిసిన శారద ఆమెను ఊరడించడానికి

మాటలు రాక మౌనంగా వుండిపోయింది కాసేపు.

"అమ్మా! అన్నయ్యలు పెళ్లికైనా కన్నా తప్పక వస్తారని నేననుకుంటున్నాను. ఒక వేళ రాకపోయినా, వాళ్ళ యిబ్బందులేవో వాళ్ళకుంటాయని సరిపెట్టుకోవాలమ్మా!" నెమ్మదిగా అంటూ తల్లి దుఃఖాన్నెవరైనా గమనిస్తారేమోనన్న భయంతో చుట్టూ కలియ చూసింది శారద.

అవును! వాళ్ళ యిబ్బందులు వాళ్ళకుంటాయి. తను వ్యామోహంలో పడి ప్రేమ నీరులాంటిదని, అది పల్లం వైపే ప్రవహిస్తుందని మరిచిపోతుంది. అరుంధతి కళ్ళల్లో మేఘాలు కమ్ముకుంటున్నాయి.

వెన్నెల చాందినీ క్రింద, తారలు అమృతాక్షతలు చల్లుతూ వుండగా శారద వివాహం జరిగింది మరికొన్ని గంటల్లో అత్తవారి వూరు వెళ్ళిపోయింది.

అంతా ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. తుఫాను తరువాత వుండే ప్రశాంతత యింటిని అలుముకుంది. ఒక్కతీ నిస్సత్తువగా వాకిట్లో కూర్చుండిపోయిన అరుంధతి దుఃఖానికీ, సంతోషానికీ అతీతంగా వుండడానికి ప్రయత్నిస్తోంది. వాస్తవంతో రాజీపడడానికి పెనుగులాడుతోంది. దుముకుతానంటున్న సెలయేళ్ళ నాపడానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది. నిర్వికారంగా ఆకాశం వంక చూస్తున్న అరుంధతి దృష్టిని దూరాన, బహుదూరాన వెలుగును చిందిస్తున్న ఒంటరినక్షత్రం ఆకర్షించింది.

★